క్లుప్తంగా

తీరం పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

కొత్తపట్నం: సముద్ర తీరంలో వేసే వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే తీరానికి వచ్చే పర్యాటకులు, స్థానిక మత్స్యకారులు ఆరోగ్యంగా ఉంటారని సన్ హెల్పింగ్ పీపుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చలగాల విజయ్‌కుమార్ అన్నారు. కొత్తపట్నం మండలంలోని కె.పల్లెపాలెం బీచ్‌లో ఆదివారం ఫౌండేషన్‌తో పాటు ఒంగోలు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వ్యర్థాలను తొలగించారు. స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది, మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు. ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు, సముద్రం నుంచి వచ్చే వివిధ రకాల వ్యర్థాలను తొలగించారు. చీపుర్లతో చిమ్మి తీరాన్ని పరిశుభ్రం చేశారు. సేకరించిన వ్యర్థాలను దూరంగా తరలించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ తీరంలో అనేక రకాల కళేబరాలు, వ్యర్థ పదార్థాలు కొట్టుకొస్తాయని, వాటిని తొలగించుకోవాలని సూచించారు. తీరంలో వ్యర్థాలు ఉండటం వలన మనకు తెలియకుండానే వ్యాధులు వస్తాయన్నారు. పర్యాటకులు తీరంలో వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో మాత్రమే వేయాలన్నారు. లేకుంటే అవి కుళ్లిపోయి దోమలు ఉత్పత్తి జరిగి స్థానిక మత్స్యకారులకు విషజ్వరాలు వస్తాయని తెలిపారు. తీరం శుభ్రంగా ఉంటే పర్యాటకులు కూడా అధికంగా వస్తారని తెలిపారు. అనంతరం తీరంలో రోడ్డు పక్కన తోపుడు బండ్ల నిర్వాహకులు, చిరు వ్యాపారులకు దాత బోయలపల్లి ప్రభావతి సహకారంతో 50 మందికి డస్ట్‌బిన్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో దీక్ష ఫౌండేషన్ ప్రతినిధి హరికిషోర్ కుమార్, మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు, వలంటీర్లు, మెరైన్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎటు చూసినా మురుగే!


కాల్వల నిర్మాణం చేపట్టనందున తాత్కాలిక ఏర్పాట్లు


చర్చి సమీపంలో నిలిచిన కాల్వల నిర్మాణం

- మల్లాయపాలెం ఎస్సీ కాలనీలో అవస్థలు
- మురుగు కాల్వల నిర్మాణానికి గోతులు తీసి నెలలు గడుస్తున్నా ముందుకు సాగని పనులు
- అనారోగ్యం బారిన పడుతున్న కాలనీ వాసులు, ప్రజలు

బల్లికురవ: మురుగు బారి నుంచి విముక్తి కల్పించేందుకు కాల్వల నిర్మాణానికి శ్రీకారం చుట్టి రెండు నెలలు అవుతున్నా అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పొక్లెయిన్లతో గోతులు తీసి అలాగే వదిలేశారు. బల్లికురవ మండలంలోని పాత మల్లాయపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత ప్రభుత్వ హయాంలోనే సిమెంటు రోడ్లు నిర్మించగా.. కొన్నిచోట్ల కాల్వల నిర్మాణం కూడా పూర్తి అయింది. కాగా ప్రస్తుతం గ్రామ పంచాయతీ సర్పంచ్ జూపల్లి రాఘవరావు, ఇన్‌చార్జి సెక్రటరీ షేక్ మీరావలి ఆధ్వర్యంలో రెండు మాసాల క్రితం తీర్మానాలతో కాలువల పనులకు శ్రీకారం చుట్టారు. 4 వీధుల్లో కాల్వల పనులు పూర్తి కాగా.. 3 వీధుల్లో మురుగు కాల్వల కోసం పొక్లెయిన్‌తో గోతులు తీసి చేతులు దులుపుకున్నారు. అలాగే బెడ్ కాంక్రీట్, కట్టుబడి పనులు ముందుకు సాగటంలేదు.

పనుల అసంపూర్తితో అవస్థలు

అసంపూర్తి పనులతో కాల్వల నిర్మాణానికి తీసిన గోతులు దాటి ఇళ్లలోకి వెళ్లలేక పోతున్నారు. దీంతో ఇప్పటికే గృహ యజమానులు సైడు కాల్వల నిర్మాణానికి తీసిన కాల్వలను పూడ్చుకుని ఇళ్లలోకి వెళుతున్నారు. కాల్వలను పూడ్చుకోవటంతో మురుగు నీరు ముందుకు కదలక దోమల ఉత్పత్తి పెరుగుతోంది. పగలు, రాత్రి దోమల దాడి పెరగటంతో జాగారాలు తప్పటంలేదు. అసంపూర్తి పనులు పూర్తి చేయించాలని అనేక పర్యాయాలు కాలనీ వాసులు, గ్రామ ప్రజలు సర్పంచ్ దృష్టికి తెస్తున్నా కాలం వెళ్లదీస్తున్నారు.

అంగన్‌వాడీ చిన్నారుల అవస్థలు

అదే కాలనీలో అంగన్‌వాడీ భవనం ముందు సైడు కాల్వల నిర్మాణానికి గోతులు తీశారు. కేంద్రానికి వెళ్లే చిన్నారులు పౌష్టికాహారం పొందేందుకు వెళ్లే బాలింతలు, గర్భిణులు కిశోర బాలికలకు అవస్థలు తప్పటంలేదు. చేసేది లేక కార్యకర్త, సహాయకులే సైడు కాల్వల నిర్మాణానికి తీసిన గొయ్యిని పూడ్చి కొంత మేర ఇబ్బందులు తొలగించుకున్నారు. ఇదీ ప్రమాదభరితమే. ఈ విషయాలను గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరీ షేక్ మీరావలి దృష్టికి తీసుకెళ్లటంతో గ్రామపంచాయతీ తీర్మానాలతో సర్పంచ్ పనులకు శ్రీకారం చుట్టారన్నారు. అయితే మూడు వీధుల్లో పనులు అసంపూర్తిగా నిలిచాయని వీటిని పూర్తిచేసి ఎంబుక్ రికార్డింగ్ చేయించుకోవాల్సిందిగా సూచించినట్లు చెప్పారు. అలాగే కొప్పరపాడులో మురుగు కాలువల కోసం తీసిన గోతుల్లో నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది.

అసంపూర్తి కాల్వలతో ఇబ్బందులు పడుతున్నాం



సైడు కాల్వల నిర్మాణానికి పొక్లెయిన్‌తో గోతులు తీసి రెండు నెలలు పూర్తి అయింది. నిర్మాణ పనులు చేపట్టనందున చిన్నపిల్లలు, వృద్ధులు, కొత్త వ్యక్తులు రాత్రిళ్లు కాల్వలకు తీసిన గోతుల్లో పడుతున్నారు. ఇప్పటికే కొందరు నిర్మాణ పనుల్లో జాప్యంతో ఎవరి ఇంటి ముందు వారు పూడ్చుకుంటున్నారు. కాల్వలు లేనందున మురుగునీటితో దోమల దాడితో వ్యాధుల బారిన పడుతున్నాం.

– బండి యేసు


కొప్పరపాడులో మురుగు కాలువల కోసం తీసిన గోతులు


ముందుకు కదలని మురుగు నీరు


పాతమల్లాయపాలెం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం ముందు మురుగు కాల్వలకు తీసిన గోతులు

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

బల్లికురవ: పశువుల ఆరోగ్య సంరక్షణకు సోమవారం నుంచి జనవరి 31 వరకు మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో రోజుకు రెండు గ్రామాల చొప్పున పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారులు పి. మహేశ్వరరావు, ఆర్. పావని కుమారి ఆదివారం తెలిపారు. పశువులకు నట్టల నివారణ మందులు గర్భకోశ వ్యాధులకు చూడి పరీక్షలు, కృత్రిమ గర్భధారణ అన్ని రకాల వైద్యసేవలు అందిస్తామన్నారు. సోమవారం వెలమవారిపాలెం, కొత్తూరు, మంగళవారం కూకట్లపల్లి, గొర్రెపాడు, బుధవారం కొప్పరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, గురువారం వైదన, కొమ్మినేనివారిపాలెం, శుక్రవారం వల్లాపల్లి అంబడిపూడి, శనివారం బల్లికురవ, గుంటుపల్లి, సోమవారం ముక్తేశ్వరం చెన్నుపల్లి, మంగళవారం కొప్పరపాలెం, మల్లాయపాలెం, బుధవారం నక్కబొక్కలపాడు, కొణిదెన, గురువారం వేమవరం, కె. రాజుపాలెం, శుక్రవారం ఉప్పుమాగులూరు గ్రామాల్లో జరిగే శిబిరాలను పశుపోషకులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలి


మేదరమెట్లలో పాల్గొన్న సంఘాల నాయకులు

మేదరమెట్ల: పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పిలుపునిచ్చారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో ఆదివారం సంఘ సమావేశం జరిగింది. ఐక్యతగా ఉన్నప్పుడే పార్టీల్లో క్రియాశీలక పాత్రపోషిస్తామన్నారు. ఈనెల 26వ తేదీన అద్దంకిలో నిర్వహించనున్న ఆత్మీయ సమావేశానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రోశయ్య, సురేష్, రమణబాబు, అశోక్, సతీష్, ఆనంద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ ఎక్కడ?

- మురుగు కాలువలతో ఇంకొల్లు గ్రామ ప్రజలు అవస్థలు
- వర్షం కురిస్తే నివాస గృహాల్లో చేరుతున్న మురుగు నీరు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు


మురుగు కాలువలో పూడిక పనులు నిర్వహిస్తున్న దృశ్యం

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు మేజర్ పంచాయతీ పరిధిలో మురుగు కాలువ సమస్య వేధిస్తోంది. ఇంకొల్లు పంచాయతీ పరిధిలో జనాభా పెరుగుతున్న దృష్ట్యా సమస్య మరింత జటిలమవుతోంది. వర్షం కురిస్తే చాలు మురుగు కాలువలు పూర్తిగా నిండిపోయి.. మురుగు నీరు నివాస గృహాలలోకి చేరుతోంది. ఇంకొల్లు జనాభా పెరుగుతున్నప్పటికీ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు నిర్వహణ కోసం సిబ్బంది దృష్టి పెట్టడం లేదు. పంచాయతీలోని జనాభాకు తగినంత సిబ్బంది లేకపోవడంతో సమస్య అలాగే ఉంది. నూతన యంత్రాలు కూడా పంచాయతీకి సమకూర్చేందుకు అధికారులు దృష్టి పెట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సుమారు 50 వేల జనాభా ఉన్న ఇంకొల్లులో కేవలం 30 మంది పారిశుద్ధ్య కార్మికులే విధులు నిర్వహిస్తున్నారు. అదే విధంగా గ్రామంలో ఎనిమిది ప్రధాన మురుగు కాలువలు ఉండగా అన్నీ పూడిపోయాయి. కడవకుదురు రోడ్‌లోని ప్రధాన మురుగు కాలువలను ఒకటో మైలు బ్రిడ్జి వరకు పూడిక తొలగించనున్నట్లు గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ అడ్డగడ వెంకటేశ్వర్లు తెలియజేశారు. అదే విధంగా దశల వారీగా అన్ని ప్రధాన మురుగు కాలువల పూడిక తొలగిస్తామని ఆయన తెలియజేశారు. కాలువల బాగు చేస్తే కానీ వర్షాలు పడిన సమయంలో గృహాల్లోకి మురుగు నీరు చేరకుండా ఉంటుందని ప్రజలు అంటున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


మల్లాయపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కృష్ణబాబు, నాయకులు

బల్లికురవ: గ్రామ గ్రామాన కమిటీలు ఏర్పాటుతో పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు తెలిపారు. ఆదివారం మండలంలోని కూకట్లపల్లి, , వెలమవారిపాలెం, జమ్ములమడక, కొత్తూరు, మల్లాయపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించి గ్రామ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కృష్ణాజలాల వివాదాల ట్రిబ్యునల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాదనను వినిపించలేకపోతోందన్నారు. ఏపీ వాటాను సాధించే విషయంలో కూటమి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తూ హక్కులను వదులు కునేలా చూస్తుందని కృష్ణబాబు వివరించారు. ప్రభుత్వ ఏర్పడి 7 నెలలైనా చేసింది ఏమీలేదన్నారు. ప్రకటనలు, ఆర్భాటాలకే పరిమితం అయిందని కృష్ణబాబు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ క్యాలెండర్‌తో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా చేయూతనిచ్చిందన్నారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం.. ఉత్తరాయణం పుష్య మాసం హస్త నక్షత్రం షష్టి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

సందడిగా మారిన తీరం


వాడరేవు తీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారింది. సంక్రాంతి సెలవులకు స్వగ్రామాలకు వచ్చి తిరిగి వెళ్తున్న వారంతా వాడరేవు తీరానికి వచ్చి సరదాగా గడిపారు. సెలవులు ముగియడం, తిరిగి ఎవరి ప్రాంతాలకు వాళ్లు తిరిగి వెళ్తుండటంతో వాడరేవు వచ్చి స్నానాలు చేసి సందడి చేశారు. వాడరేవు తీరానికి చీరాల, పర్చూరు, అద్దంకి, ప్రత్తిపాడు, గుంటూరు, చిలకలూరిపేట, నర్సరావుపేట ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించి సందడి చేశారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతు సముద్రంలో స్నానమాచరించి ఆనందోత్సాహాలతో గడిపారు. తీరం ఒడ్డున యువకులు, మహిళలు చిన్నారులు సేదతీరుతూ సముద్రపు మన్నుతో ఆటలాడుతూ కడలి చెంత సంతోషంగా గడిపారు.

బహుజనులంతా ఏకతాటిపై నడవాలి


మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నందన్‌కుమార్

- బహుజన్ సమాజ్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నందన్‌కుమార్

చీరాల రూరల్: బహుజనులంతా ఏకతాటిపై ఐకమత్యంతో రాజ్యాధికారంవైపు నడవాలని హైదరాబాద్ మాజీ పోలీసు కమిషనర్, బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కెపోగు నందన్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఐక్యనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడిగా వల్లెపు వాసు, వేటపాలెం మండల అధ్యక్షుడిగా కలువ కళ్యాణ్‌ను నియమించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నందన్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. భారత దేశంలో సిద్ధాంతపరంగా ఉన్న పార్టీ బీఎస్పీనేనని చెప్పారు. దేశంలో 85 శాతం ఉన్న బహుజనులు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారని వారికి అధికారం వచ్చినప్పుడే అందరికీ అన్ని ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. దీనికి పూలే, అంబేడ్కర్, కాన్షీరామ్‌లే మార్గమని చెప్పారు. ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటి మార్క్, నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్, నాయకులు కోటేశ్వరరావు, భగత్‌సింగ్, సంగీతరావు, మహేంద్ర, అనిల్, సుధాకర్, విన్సెంట్, పృధ్వీ, సుబ్బారావు, విజయ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గో మాత ప్రాముఖ్యత కోసమే మహాపాదయాత్ర


గోమాత ప్రాధాన్యత వివరిస్తున్న రొటేరియన్ బాలకృష్ణ

పర్చూరు(చినగంజాం): గోమాత ప్రాముఖ్యత గురించి అందరికీ చాటి చెప్పేందుకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 4900 కి.మీ మహా పాదయాత్ర చేపట్టినట్లు హైదరాబాద్ రోటరీ క్లబ్ రొటేరియన్ బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. ఆదివారం పాదయాత్ర చేస్తూ పర్చూరు వచ్చిన ఆనయకు స్థానిక రోటరీ క్లబ్ సభ్యులు స్వాగతం పలికారు. హిందూ సనాతన ధర్మంలో భాగంగా భూమాతకి, గోమాతకి గల అనుబంధాన్ని ప్రపంచానికి చాటి చెప్పే ఉద్దేశంలో యాత్ర చేపట్టినట్లు ఆయన వివరించారు. అనుచరులు సతీష్, సిద్ధు, మణి, హైందవ్, స్థానిక రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ తేళ్ళ రమేష్ చంద్ర, అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, నాగబైరు శ్రీనివాసరావు, కొల్లా నరేంద్ర, గడ్డిపాటి శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి

చీరాల అర్బన్: చైతన్య భారతి ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌వీఎస్ఎస్‌జేఆర్ కళ్యాణ మండపం మేడపైన సంగీత సద్గురు త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం శ్రీహనుమత్ లక్ష్మణ సమేత శ్రీసీతారామస్వామివారికి, నాద బ్రహ్మశ్రీ త్యాగరాజస్వామి వారికి అష్టోత్తర పూజ, ధూప, దీప, నైవేద్యం నిర్వహించారు. రాత్రి హైదరాబాద్‌కు చెందిన విష్ణుభొట్ల సోదరులు ముకుంద శర్మ, ఉదయ్‌శంకర్ లచే గాత్ర కచ్చేరి నిర్వహించారు. గాత్రకచ్చేరికి కృష్ణవేణి వయోలిన్, బీవీఎస్ ప్రసాద్ మృదంగం, మార్చూరి హరిబాబు ఘటంపై సహకారం అందించారు. కార్యక్రమాలను చైతన్య భారతి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సూర్యదేవర ఉమామోహన్, భాగి నారాయణశాస్త్రి, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, రగ్గుల అందజేత

చీరాల రూరల్: చీరాల అభివృద్ధి సాధనా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు. సమితి ప్రతినిధులు శీలం రవికుమార్, ఊటుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడారు. యానాది సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు పూరిగుడిసెల్లో చలికాలంలో పిల్లలతో ఎంతో ఇబ్బందులు పడుతున్నారని వారికి చిరుసాయం చేసినట్లు చెప్పారు. ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ ఆనుకుని ఉన్న తోటవారిపాలెంలోని బుర్లవారిపాలెం పంచాయతీలోని మోడల్‌స్కూలు వెనుక కాలువ కట్టపై జీవనం సాగిస్తున్న 100 మంది.. దాతలకు కృతజ్ఞతలు చెప్పారు.


దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేస్తున్న చీరాల అభివృద్ధి సాధన సమితి సభ్యులు

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోండి


పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్

అద్దంకి రూరల్: విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని సంతమాగులూరు లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో 11 మంది విద్యార్థులు పాల్గొన్నారు.